# సన్నాల కొనుగోళ్లు ఇంకెప్పుడో

- దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకే కేంద్రాల ఏర్పాటు
- సన్న ధాన్యాన్ని మిల్లుల్లో విక్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ప్రకటనలకే పరిమితమైన మద్దతు ధర, బోనస్


కందిబండ కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన సన్నరకం ధాన్యం

**మేళ్లచెరువు :** గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన ప్రతి గింజనూ కొంటామని పాలకులు, అధికారులు చెప్తున్న మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మేళ్లచెరువు మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నా నేటికీ సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు రైస్ మిల్లుల్లో ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాకు రూ.2320 మద్దతు ధర అందిస్తామని, రూ.500 ఇస్తామని చెబుతున్నప్పటికీ నేటికీ సన్న రకం ధాన్యం కొనకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రైతులు దళారులకు అమ్ముకొని మోసపోతున్నారు. మేళ్లచెరువు మండల కేంద్రంలో పాటు కందిబండలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా అక్కడ సన్నరకం ధాన్యాన్ని కొనడం లేదు. దీంతో ఆయా కేంద్రాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు అయోమయంలో పడ్డారు.

**15 వేల ఎకరాల్లో వరి సాగు..**

మండలంలో ఆయకట్టు, బోర్లు, బావుల కింద సుమారు 15 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో సమృద్ధిగా నీరు అందడం, పెద్దగా చీడపీడలు బెడద లేకపోవడంతో ఎకరానికి 40 బస్తాలకు పైగా దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు. కొనుగోలు కేంద్రాలు లేక మిల్లుల్లో ధాన్యం విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. సన్నరకం పచ్చి ధాన్యాన్ని గత 15 రోజుల కిందట రూ. 2500 విక్రయించగా ప్రస్తుతం రూ.2 వేల నుంచి రూ. 2200 మాత్రమే మిల్లర్లు చెల్లిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

**మిల్లుల్లో తక్కువ ధరకు..**

రైతులు పచ్చి వడ్లను ఆరబెట్టడానికి వ్యయ ప్రయాసలు పడలేక ఒకవేల ఆరబెట్టినా ధర ఎంత వస్తదో తెలియక, ఆరబెట్టే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా జరిగే నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ పరిధిలోని మిల్లుల్లో విక్రయిస్తున్నారు. మిల్లుల వద్దకు ట్రాక్టర్లు వెళ్లాక మిల్లర్లు తక్కువ ధర చెల్లించినా ధాన్యాన్ని వెనక్కి తీసుకొని రాలేక అక్కడే అమ్ముకొని రావల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వాతావరణంలో మార్పులతో వర్షాలు రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని రైతులు కోరుతున్నారు.

**సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి**



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ అందేలా చూడాలి. సన్నరకం ధాన్యం కొనకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు.

– లావుడియా గోపినాయక్, రైతు

**మిల్లులో విక్రయించా**



కొనుగోలు కేంద్రాలు లేక ఇప్పటికే సగం మంది రైతులు ధాన్యాన్ని వ్యాపారులకు అమ్ముకున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో నేను పండించిన ధాన్యాన్ని కూడా హుజూర్‌నగర్‌లోని మిల్లు లో విక్రయించా. నాకు మద్దతు ధర, బోనస్ అందకుండా పోయింది. ప్రభుత్వం త్వరితగతిన కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– చల్లా పుల్లయ్య, రాఘవాపురం, రైతు

# ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

- రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ వీరయ్య


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీరయ్య

**మునగాల :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ చూపిన అహింసామార్గం, రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ విశేష కృషి, రాజ్యాంగం అందించిన సమానత్వం, న్యాయం వంటి విలువలను ప్రజలకు చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో కొన్ని శక్తులు మన రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నాయని, మనందరం ఐక్యంగా నిలిచి ఈ ఉద్యమంలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, ఎలక నరేందర్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, బచ్చు అశోక్, కాసర్ల బోస్, బసవయ్య, ఉప్పుల జానకిరెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

**మునగాల :** మండలంలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి బి.శిరీష కోరారు. బుధవారం మునగాల మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గుర్తించాలన్నారు. కూలీల రిపోర్టు, నర్సరీలపై నివేదిక, కూలీల హాజరు పట్టికను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఏపీఓ శైలజ, సీసీ కళ్యాణ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## తాగునీటి కొరత రాకుండా చూడాలి

**గరిడేపల్లి :** గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా చూడాలని డీఎల్‌పీఓ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులు, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, గ్రామ పంచాయతీ నర్సరీ, వివిధ రకాల పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు సక్రమంగా పెరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరయ్య, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సైదా, సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎకరానికి రూ.24 లక్షల నష్టపరిహారం

- ఆర్డీఓ శ్రీనివాసులు


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

**హుజూర్‌నగర్ (చింతలపాలెం) :** చింతలపాలెం మండల కేంద్రంలో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల కింద భూమి కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.24 లక్షల వరకు నష్టపరిహారం అందిస్తుందని ఆర్డీఓ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం చింతలపాలెంలో బాధిత రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. భూములతో పాటు పొలంలో బోర్లు, చెట్లు, ఇతర కట్టడాలకు కూడా ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ తమ పొలాల్లో ఇప్పటికే శివగంగా లిఫ్ట్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారని, కానీ ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని భూమి కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కుంటకి రూ.3 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని మరి కొంతమంది రైతులు డిమాండ్ చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. లిఫ్ట్ పైప్‌లైన్‌కి భూమి ఇవ్వమని అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణాన్ని వైభవంగా నిర్వహించాలి**

**హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ శాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించే తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్య, ఎస్ఐ ముత్తయ్య, ఈఓ లక్ష్మణరావు, ఆలయ చైర్మన్ గురవయ్యగౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, ఈడ్పుగంటి సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.

# ఇతరులను ఇబ్బంది పెట్టొద్దు

- ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి


పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఆర్ డీఎస్పీ

**మోతె :** స్వార్థం, క్షణికావేశాలతో ఇతరులను ఇబ్బంది పెట్టొద్దని ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి అన్నారు. బుధవారం మోతె మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంతో విలువైన ప్రాణాలు కోల్పోవద్దన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ ప్రజలపై ఉందన్నారు. ప్రజలకు చట్టాలపై, జైలు శిక్షలు, మంచి నడవడిక, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్సై యాదవేందర్‌రెడ్డి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కోదాడరూరల్ : కాపుగల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

**కోదాడరూరల్ :** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాపుగల్లులో స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, చైర్మన్ నంబూరి సూర్యం, ఏఓ పాలెం రజిని, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.

**చిలుకూరు :** మండలంలోని నారాయణపురంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదులు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మనబోయిన వీరబాబు, మాజీ సర్పంచ్ మండవ వెంకటేశ్వర్లు, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు జానిమియా, సీఈఓ పూర్ణయ్య, డైరెక్టర్లు, సంఘం సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

**మోతె :** మండల కేంద్రంతో పాటు హుస్సేన్‌బాద్, మామిళ్లగూడెం, కొత్తగూడెం, విభళాపురం గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ ఆంజనేయులు, ఏఓ అరుణ, ఆర్ఐ రమేష్, ఏఈఓ ఉష, ఏపీఎం వెంకయ్య, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధ్యక్షుడు జక్కుల నరేందర్ యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ కత్తుల రవీందర్ ప్రారంభించారు. సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

**అనంతగిరి :** మండలంలోని వాయిల సింగారంలో తెల్లబెల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ బుర్ర వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో కొల్లు ప్రభాకర్, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, ఏఈవో అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

**చిలుకూరు :** మండలంలోని బేతవోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కొండాపురం ఫీడర్, బేతవోలు ఫీడర్ల పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి**

**కోదాడరూరల్ :** మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని కోరుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ వి.వి.రాంచందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. రుష్లా, సిద్ధయ్య, సతీష్, భిక్షం, ప్రమీల, శంకర్ ఉన్నారు.

**చలివేంద్రం ఏర్పాటు**

**మునగాల :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్ఐ రామారావు, మీసేవ శర్మ పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత**

**అనంతగిరి :** మండలంలోపలువురి లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు శ్రీనివాసరెడ్డి అందజేశారు. అనంతగిరి గ్రామానికి చెందిన రెడ్డిపల్లి చంద్రయ్యకు రూ.60వేలు, మాదాసు రత్నకుమారికి రూ.2 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేగ కొండయ్య, చింతకుంట్ల సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని రాస్తారోకో


కోదాడలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు


హుజూర్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

**హుజూర్‌నగర్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోలు ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు కోరారు. వంట గ్యాస్, పెట్రో ధరల పెంపును నిరసిస్తూ బుధవారం హుజూర్‌నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణ, మామిడి వెంకయ్య, వెంకన్న, శ్రీను, ఉమ, స్వామి, గాంధీ, ప్రసాద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బీజేపీ**

**కోదాడరూరల్ :** పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు మేకల శ్రీనివాసరావు, బత్తినేని హనుమంతరావు బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపునకు నిరసనగా బుధవారం కోదాడలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిలిండర్‌పై రూ.55 పెంచి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లతీఫ్, పోతురాజు సత్యనారాయణ, మాతంగి ప్రసాద్, కొండా కోటేశ్వరరావు, నాగుల్‌మీరా, కాటమరాజు, రహిమాన్, మోషిన్ ఉన్నారు.

**గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి**

**హుజూర్‌నగర్‌రూరల్ :** వంట గ్యాస్ ధర పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని గోపాలపురంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ– హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి సిద్దెల వెంకటయ్య, చందాల భిక్షం, సైదులు, తిరుపతయ్య, మాధవరావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

**గ్యాస్, పెట్రోలు ధరలు తగ్గించాలి**

**నేరేడుచర్ల :** పెంచిన గ్యాస్, పెట్రోలు ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ నేత రావుల సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఉన్నారు.

**గ్యాస్ ధర తగ్గించేవరకూ ఆందోళన**

**మఠంపల్లి :** కేంద్రం ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించేవరకూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తామని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాల యం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, నాయకులు సయ్యద్‌రసూల్‌మియా, రాము, వెంకటేశ్వర్లు, రామయ్య పాల్గొన్నారు.

**గ్యాస్ ధర పెంపుతో పేదలపై భారం**

**చిలుకూరు :** కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ బుధవారం చిలుకూరులో కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ బండ ధరలు పెంచి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపిందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు రెమిడాల రాజు, చేపూరి కొండలు, సాహెబ్ అలీ, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, దొడ్డా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**మేళ్లచెరువులో సీపీఎం రాస్తారోకో**

**మేళ్లచెరువు :** కేంద్రం గ్యాస్ బండ ధర పెంపును ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం మేళ్లచెరువు మెయిన్ రోడ్డుపై సీపీఎం ఆధ్వర్యంలో సిలిండర్లతో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు, గుండు సైదులు, వెంకటేశ్వర్లు, అశోక్, లక్ష్మీనారాయణ, రాజు, వినోద్, సురేష్, నరసింహ, అంజి, తదితరులు పాల్గొన్నారు.

**వంటగ్యాస్ ధర తగ్గించాలని ధర్నా**

**మునగాల :** వంట గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ సైదా, పార్టీ సీనియర్ నాయకుడు దేవరం వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు జగన్నాథపురంలో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పార్టీ మండల కమిటీ సభ్యులు వీరబోయిన వెంకన్న, వెంపటి వీరబ్రహ్మం, బూతం వెంకన్న, సైదులు, డీవైఎఫ్ఐ నాయకులు ఖాదర్, గుర్వయ్య, స్టాలిన్, వెంకన్న, లింగరాజు పాల్గొన్నారు.

**పెంచిన ధరలు తగ్గించాలని వినతి**

**గరిడేపల్లి :** పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ధరల పెంపుపై నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం గరిడేపల్లిలో గ్యాస్ బండలతో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, వెంకటరెడ్డి, నబిసాహెబ్, చిన్న భద్రయ్య పాల్గొన్నారు.

## జాతీయ జెండా వద్ద సుందరీకరణకు స్థలం విరాళం


దాతను సన్మానిస్తున్న ఐవీఓ సభ్యులు

**కోదాడరూరల్ :** పట్టణ పరిధిలోని సింగారం రోడ్డులో ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ (ఐవీఓ) ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన 100 అడుగుల జాతీయ జెండా చుట్టూ సుందరీకరణకు 433 గజాల స్థలాన్ని కత్తి భగత్ బుధవారం విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. జాతీయ జెండా నిర్మాణానికి గతంలో 101 గజాల స్థలాన్ని ఇచ్చి, ఇప్పుడు 433 గజాల స్థలాన్ని అందజేసి తన దేశభక్తిని చాటుకున్నారని అన్నారు. అనంతరం దాత కత్తిభగత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు డాక్టర్ జగిని ప్రసాద్, వెంకన్న, శ్రీనివాసరావు, సేకు రమేష్, గోవిందు నవీన్, భరత్‌కుమార్, రహీం ఉన్నారు.

## రాజేశ్వరరావుకు నివాళి

**హుజూర్‌నగర్ :** మానవతావాది, సీపీఐ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రమేష్, ఐ.వెంకటేశ్వర్లు, ఎస్.కృష్ణ, మామిడి వెంకయ్య, జె.వెంకన్న, జె.శ్రీను, వై.ఉమ, కె.స్వామి, గాంధీ, బత్తిని ప్రసాద్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

- సీడీపీఓ వెంకటలక్ష్మి


హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ వెంకటలక్ష్మి

**హుజూర్‌నగర్ :** గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని, వారి కోసమే పోషణ పక్షం నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని 19, 20 వార్డుల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ సందర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సోమమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

**పోషణ పక్షోత్సవాల్లో భాగస్వాములు కావాలి**

**చిలుకూరు :** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించే పోషణ పక్షోత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని సీడీపీఓ వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం చిలుకూరులోని అంగన్‌వాడీ కేంద్రం –4 లో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్ సిరికొండ కవిత తదితరులు పాల్గొన్నారు.

**సోమారంలో..**

**నేరేడుచర్ల :** మండలంలోని సోమారం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం– 3లో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పోషణ పక్షోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, టీచర్ సంధ్య, ఆయా రత్న ఉన్నారు.

**రాయినిగూడెంలో..**

**గరిడేపల్లి :** గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. బుధవారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం –2లో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగమణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

**తొగర్రాయిలో..**

**కోదాడరూరల్ :** బిడ్డలు ఆరోగ్యంగా ఎదగాలంటే పుట్టిన నాటి నుంచి రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందివ్వాలని పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ లావణ్య అన్నారు. బుధవారం కోదాడ మండలంలోని తొగర్రాయిలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యదర్శి అవినాష్, అంగన్‌వాడీలు మణెమ్మ, పద్మ, అలివేలు మంగ, సునీత, ఆయాలు ఉన్నారు.

# ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎంఈఓ సలీంషరీఫ్

**కోదాడ :** ప్రభుత్వ పాఠశాలలపై పిల్లల తల్లిదండ్రులకు నమ్మకం పెంచి, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోదాడ మండల విద్యాధికారి ఎండీ. సలీంషరీఫ్ కోరారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకమ్మ, ఉపాధ్యాయులు పద్మకుమారి, శ్రీనివాస్, పద్మావతి, గణపాంబ, సంతోషికుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

## మిత్రుడి కుటుంబానికి చేయూత


ముత్తయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధుబాబు స్నేహితులు

**మోతె :** మండలంలోని రావిపహాడ్ గ్రామంలో చాట్ల మధుబాబు తండ్రి చాట్ల ముత్తయ్య గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మధుబాబు స్నేహితులు మంగళవారం అతని కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ముత్తయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెరుగు లింగరాజు, దాసరి ఉపేందర్, సోమగాని రాంబాబు, ఎడ్ల సైదులు, తిప్పర్తి సతీష్, చిట్టెక్కి దేవ లింగం, కుంబ ఉపేందర్‌రావు, నాగయ్య, సందీప్, మల్లికార్జున్, వెంకటాచారి, సైదులు, శ్రీను ఉన్నారు.

## తండాల అభివృద్ధికి చొరవ చూపాలి


ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాబునాయక్, తదితరులు

**మఠంపల్లి :** ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్‌ను మఠంపల్లి మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మఠంపల్లి మండలంలో గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని, లంబాడాలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేయాలని ఆయనను కోరారు. శంకర్‌నాయక్ సానుకూలంగా స్పందించినట్లు బాబునాయక్ తెలిపా రు. నాయకులు మోతీలాల్ నాయక్, ఈశ్వర్‌నాయక్ ఉన్నారు.

## కల్యాణ మండపం నిర్మాణానికి దాతల విరాళం

**నడిగూడెం :** మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం నడిగూడెంకు చెందిన బీరవల్లి సీతారాంరెడ్డి 30 సిమెంట్ బస్తాలు, మాడుగుల చక్రపాణి రూ.15 వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవురిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండా వెంకన్న, సభ్యులు వందనపు సూర్యప్రకాశరావు, మహేష్, మోహన్ రావు, చెన్నూరి బాబు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు మంజూరు చేయాలని వినతి

**నేరేడుచర్ల :** ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేసి రేషన్ షాపుల ద్వారా 13 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నేరేడుచర్ల మండల తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేమునూరి పావని, ఉపాధ్యక్షురాలు సయ్యద్ రేష్మ, కిష్టమ్మ, శ్యామల, నాగేంద్ర, నాగమణి, సావిత్రమ్మ, సుజాత, సుమలత, లచ్చమ్మ తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

**చిలుకూరు :** మండలంలోని బేతవోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ మాజీ సర్పంచ్ భర్త, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వట్టికూటి నాగయ్య బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని పలు ఇళ్లకు ఓనర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి రూ. 7 లక్షలు లంచం తీసుకున్నారని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలను పది రోజుల్లో అక్రమంగా డ్రా చేశారని ఆరోపించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఒకరి మరణ ధ్రువీకరణ ప త్రాన్ని తప్పుడు తేదీతో ఇచ్చారని తెలిపారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, డీపీఓకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ సైదాబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్రా జీవితం ఆదర్శం


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**కోదాడ :** పేదల కోసం జీవితకాలం పోరాటాలు చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి జీవితం నేటి యువతకు ఆదర్శమని పలువురు సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం కోదాడలోని సుందరయ్య భవన్‌లో నర్రా రాఘవరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మిట్టగడుపుల ముత్యాలు, లింగయ్య, సతీష్, వెంకటేశ్వర్లు, సైదులు, శ్రీను, పాల్గొన్నారు.